క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: కిలో...రూపాయల్లో.. టమా టా.67, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 75, బజ్జీమిర్చి 75, క్యాప్సికమ్ 53, పచ్చకాకర 45, పందిరి బీర 50, క్యాబేజీ 16, క్యారెట్ 45, దొండ 28, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 75, గోకరకాయ 35, కీర 40, దోసకాయ 16, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 35, కందగడ్డ 40, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వేద పాఠశాల ఆవరణలో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

కంటోన్మెంట్: తొలి ఏకాదశిని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృత కళాశాల ఆవరణలో వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె నివేదిత ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు భానోతు సురేంద్ర మాట్లాడుతూ తొలి ఏకాదశి నుండి హిందువుల పండుగలు ప్రారంభమవుతాయన్నారు. వాతావరణంలో ఏర్పడే మార్పులకు అనుగుణంగా ఈ పండుగ రోజు పేలాలు, బెల్లం చూర్ణాన్ని తిన్నట్లయితే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషన్, అధ్యాపకులు సుబ్రహ్మణ్య శర్మ, ప్రభాకర్ శర్మ, సందరేశ్వర్, శ్రీధర్ స్వామి, మాధవి, సత్యనారాయణ, గణపతి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రహమత్‌నగర్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ దేశ ప్రజల అభ్యున్నతి కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బీజేపీ శ్రేణులకు సూచించారు. రహమత్‌నగర్‌లో గురువారం పార్టీ డివిజన్ అధ్యక్షుడు కనకరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కిషన్‌రెడ్డి మాట్లాతుతూ... ప్రధాని మోదీ ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రపంచ వ్యాప్తంగా మన్ననలు పొందుతున్నాయన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ వీరపనేని పద్మ, సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గౌతంరావు, కీర్తిరెడ్డి, జూబ్లీహిల్స్ కన్వీనర్ కుంభాల గంగారాజు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి భరత్‌గౌడ్, సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ, నేతలు ప్రేమ్, సముద్రాల మల్లేశ్‌గుప్తా, కళావతి తదితరులు పాల్గొన్నారు.

'చంద్రశేఖర్‌ఆజాద్‌పై కాల్పులను ఖండిస్తున్నాం'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉత్తర ప్రదేశ్‌లోని సహరన్‌పూర్‌లో భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై జరిగిన కాల్పులను ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రవి మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖర్‌ఆజాద్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపి పారిపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. పారిపోయిన వారు ఉపయోగించిన వాహనం గుర్తింపు ఆధారంగా నిందితులను పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీజేపీ మనువాద పాలనలో సామాజిక, శక్తులపైన ప్రజాస్వామిక వాదులపైన అనేక దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రేపటి నుంచి కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం

చిక్కడపల్లి: ప్రముఖ సాహితీవేత్త, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ 85వ జన్మదినం సందర్భంగా త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఆయన సాహితీ సప్తాహం జూలై 1 నుంచి 7 వరకు ఏడు రోజుల పాటు కళాసుబ్బారావు కళావేదికపై జరుగుతుంది. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం విలేకర్ల సమావేశంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తెలియజేస్తూ ఇనాక్‌ను గానసభతో ఎంతో అనుబంధం ఉందని ఆయన వ్యక్తిత్వం, సాహిత్య విశిష్టతను దృష్టిలో ఉంచుకుని సాహిత్య సప్తాపం పేరిట ఆయన వివిధ ప్రక్రియల్లోని రచనలు ఆవిష్కరిస్తామని తెలిపారు. వరుసగా వ్యాస పరిణామం, వలస, దిక్కులేనోడు, విశాలశూన్యం, విమర్శిని, పాలి, ఆల్ఫ్ ఆఫ్ పార్డన్ సంపుటిలను ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, మాజీ మంత్రి బుద్ధప్రసాద్, గ్రంథాలలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ ముఖ్యఅతిథులుగా హాజరై ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో గుండవరపు గీతాదేవి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ఆనందం



ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో తులసీదళార్చన చేస్తున్న వేద పండితులు



ప్రత్యేక అలంకరణలో కళ్యాణ వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక పూజలు చేస్తున్న సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ

చిలకలగూడ: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల వద్ద సందడి నెలకొంది. పుష్పాలు, విద్యుత్ దీపాలతో ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. నామాలగుండు కళ్యాణ వెంకన్నస్వామి, సీతాఫల్‌మండి రామలింగేశ్వరస్వామి, శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు నేతృత్వంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. చిలకలగూడ సీఐ మట్టంరాజుకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈఓ రాజేష్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ప్రసన్న వేంకటేశ్వస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

సనత్‌నగర్: తొలి ఏకాదశి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో తెల్లవారుజాము నుంచి జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా సుప్రభాత సేవ, శ్రీవెంకటేశ్వరస్వామి వారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం (108 లీటర్ల పాలతో), శ్రీవిష్ణు సహస్ర నామ సహిత లక్ష తులసీ దళములతో విశేష అర్చన, స్వామివారికి విశేష ఫల పుష్ప అలంకరణ కార్యక్రమాలు జరిగాయి. సనత్‌నగర్ పరిసర ప్రాంత భక్తులు విశేషంగా హాజరై తొలి ఏకాదశి పూజల్లో పాల్గొని స్వామి వారి సేవలో పునీతులయ్యారు.



తొలి ఏకాదశి పూజకు తులసీదళాలను సిద్ధం చేస్తున్న భక్తులు

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



రెజిమెంటల్‌బజార్‌లోని విఠలేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారు



ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో విద్యా శంకర భారతి తీర్థ స్వామివారు

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లోని పాండురంగ విఠలేశ్వర స్వామి దేవాలయంలో గురువారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. దేవాలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి దేవాయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం తొలి ఏకాదశిని పురష్కరించుకని ఉదయం నుంచి సాయంత్రం స్వామిరిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జల నగేష్, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక, మాజీ చైర్మన్ కర్ణకుమార్ పాల్గొన్నారు.

ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా పుష్పగిరి పీఠాధిపతి విద్య శంకర భారతి తీర్థ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారు భక్తులకు ఆశీర్వచనాలు అందించారు.

సెక్యూరిటీగార్డ్ అదృశ్యం



అదృశ్యమైన ప్రహ్లాద్‌నాయక్

సనత్‌నగర్: విధులకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్ళిన సెక్యూరిటీ గార్డ్ అదృశ్యమైన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట ఎస్‌ఐ గంగాధర్ తెలిపిన మేరకు.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ప్రహ్లాద్‌నాయక్ (55) బేగంపేటలోని క్వీన్స్ ప్లాజాలో సెక్యూరిటీగార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నెల 21న రాత్రి 8 గంటలకు విధులకు వెళ్ళిన ప్రహ్లాద్‌నాయక్ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో బేగంపేట పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు 'డబుల్' ఇళ్లను కేటాయించాలి

రహమత్‌నగర్(బోరబండ): జీహెచ్‌ఎంసీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బోరబండ సైట్–2 కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు తులిసిబాయ్ మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్‌లో దాదాపు 600 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారన్నారు. అందులో 90 శాతానికి పైగా ఇళ్లు లేని పేదలే అని ఆమె తెలిపారు. పారిశుద్ధ్య కార్మి కులకు ఇళ్లను కేటాయించే వరకూ తమ పోరాటం అగదని హెచ్చరించారు. ప్రజా సంఘాల నేత శేషగిరి రావు, రాధ, శ్రీలక్ష్మి, శాంతమ్మ, వినోద్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం

చిక్కడపల్లి: కమ్యూనిటీహాల్ భవనం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకవస్తామని కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ అన్నారు. గురువారం డివిజన్‌లోని అశోక్‌నగర్ వెల్ఫేర్ కల్చర్, వెల్ఫేర్ అసోసియేషన్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధిలో భాగంగా ఎంపీ లడ్స్ నిధులను కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మంజూరుచేసి కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి సహకరిస్తున్నారన్నారు. ప్రజల అవసరార్థం కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నిధులను మంజూరుచేయడం పట్ల స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నగర్ మాజీ అధ్యక్షులు వినయ్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు రమణమూర్తి, కార్యదర్శి సూర్యప్రకాష్, హనుమంతరావు, పద్మావతి పాల్గొన్నారు.

మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 'ఆర్వో' ఏర్పాటు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ ఈస్ట్ ఎంసీహెచ్ కాలనీలోని మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాకారుల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ప్యూరిఫయర్ (ఆర్వో) ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీని నాయిని ఫౌండేషన్ చైర్మన్, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫయర్‌ను క్రీడాకారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు సీహెచ్.వీరారెడ్డి, బొల్లం శ్రీనివాస్, సోమేశ్వర్, మురళీ, రమేష్, జైపాల్‌రెడ్డి, సుధాకర్, మహేష్, రమణ, ఎం.ఎస్.చారి, బీఆర్ఎస్ నాయకులు సిరిగిరి శ్యామ్, నేత శ్రీనివాస్, రేశం మల్లేష్, లక్ష్మణ్, బాలరాజు, సదా, బుజ్జి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సాయిచంద్ మృతి పట్ల డిప్యూటీ స్పీకర్ సంతాపం

సికింద్రాబాద్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, గాయకుడు సాయిచంద్ మృతిపట్ల శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ సంతాపం ప్రకటించారు. సాయిచంద్ మృతితో తెలంగాణ ఒక గొప్ప ఉద్యమకారుడిని, గాయకుడిని కోల్పోయిందన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో సాయిచంద్ సేవలు చిరస్మరణీయమన్నారు. సాయిచంద్ ఆత్మకుశాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. సాయిచంద్ అంత్యక్రియలకు హాజరైన డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ వారి కుటుంబ సభ్యులకు సానుభూతితెలిపారు.

సాయిచంద్ హఠాన్మరణం బాధాకరం

లాలాపేట: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మైన్ సాయిచంద్ హఠాన్మరణం ఎంతో బాధాకరం అని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం గుర్రంగూడలోని సాయిచంద్ నివాసానికి వెళ్లి అయన మృతదేహం వద్ద పూలమాలతో శ్రద్ధాంజలి ఘటిస్తూ నివాళులర్పించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన గొంతుతో ఆటా పాటతో ఉద్యమకారుల్లో స్ఫూర్తిని నింపారని గుర్తు చేసుకున్నారు. అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

కంటోన్మెంట్: తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ హఠాన్మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటు అని బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం బోయిన్‌పల్లిలోని తన కార్యాలయ ఆవరణలో సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సాయిచంద్ సేవలను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేత ముప్పిడి మధుకర్, బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్ పాల్గొన్నారు.



సాయిచంద్ అంత్యక్రియలకు హాజరైన డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

రోడ్డు నిర్మాణం ఆగిందని ఆర్యనగర్ వాసుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్యనగర్ మహిళలు

లాలాపేట: నెల రోజుల నుంచి సీసీ రోడ్డు నిర్మాణం ఆగిపోయిందని గురువారం ఆర్యనగర్ వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదపుగా రూ 7 కోట్ల మేరకు బిల్లులు రావాల్సి ఉంది ...బిల్లులు చెల్లించే వరకు పనులు చేసేది లేదని ఇంజనీరింగ్ అధికారులకు లెటర్ ఇచ్చానని కాంట్రాక్టర్ అంటున్నాడని వారు ఆరోపిస్తున్నారు. దీంతో శాంతినగర్ ఆర్యనగర్‌లో నూతన చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులు నిలిచిపోయాయి. ఈ విషయమై సదరు కాంట్రాక్టర్‌ను నిలదీయగా తనకు జీహెచ్‌ఎంసీ నుంచి పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు రోడ్డు నిర్మాణం చేయనని అధికారులకు చెప్పినట్లు కాంట్రాక్టర్ ఖరాకండిగా చెప్తున్నాడు.

దివ్యాంగుల మహాధర్నాను జయప్రదం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జూలై 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే దివ్యాంగుల మహాధర్నాను జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, అ డివయ్య పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దివ్యాంగుల మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో దివ్యాంగులకు రక్షణ లేకుండాపోతుందన్నారు. బాలికలు, మూగ, చెవిటి, మానసిక మహిళా దివ్యాంగులపై లైంగిక వేధింపులు, అత్యాచారులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో కోశాధికారి వెంకటేష్, శశికళ, రంగారెడ్డి, క్రాంతి కుమార్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

'అక్రమ నిర్మాణం వెనుక ఎమ్మెల్యే ప్రమేయం'

కంటోన్మెంట్: ఆరోవార్డు భారతీ అవెన్యూ కాలనీ గుండా వెళ్లే నాలాను దారి మళ్లించి, కంటోన్మెంట్ స్థలంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణం వెనుక కూకట్‌పల్లి ఎమ్మెల్యే, ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ప్రమేయం ఉందంటూ బోర్డు సభ్యుడు రామకృష్ణ (ఆర్‌కే) తీవ్ర ఆరోపణలు చేశారు. భారతీ అవెన్యూలో రూ.11 లక్షల బోర్డు నిధులతో చేపట్టిన మంచినీటి పైపులైను పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు డ్రైనేజీ సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కాలనీని ఆనుకుని ఉన్న స్థలంలో చేపట్టిన అపార్ట్‌మెంట్ నిర్మాణం వల్ల తమ డ్రైనేజీ లైను మూసుకుపోయిందన్నారు. ఇందుకు స్పందించిన రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ డ్రైనేజీ లైను వేయాల్సిందిగా నిర్మాణదారులకు చివరిసారిగా మరోసారి హెచ్చరికలు చేస్తున్నామన్నారు. బోర్డు అనుమతులు లేకుండానే చేపట్టిన ఈ నిర్మాణాన్ని ఆపేందుకు కోర్టుకెళ్దాం అంటూ కాలనీ వాసులకు సూచించారు. ఈ విషయమై సీఈఓ మధుకర్ నాయక్ ద్వారా కూడా చర్యలు తీసుకుంటామన్నారు. బోర్డు పరిధిలోని స్థలంలో ఐదు అంతస్తుల నిర్మాణం చేపట్టే అవకాశం ఎంతమాత్రమూ లేదన్నారు. ఈ మేరకు కంటోన్మెంట్ ఆదాయానికి కూడా నష్టం వాటిల్లుతోందన్నారు. కార్యక్రమంలో దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె నివేదిత, బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసాయి సప్తాహ ఉత్సవాలు

బన్సీలాల్‌పేట్: పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన శ్రీ సాయిబాబా దేవాలయంలో శ్రీ సాయిసప్తాహ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ సాయిస్వర్ణాభిషేకం పూజా కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని రావి, వేప వృక్షాలకు లక్ష్మీనారాయణకల్యాణం నిర్వహించారు. అదే విధంగా శ్రీ సాయి విభూతి సేవ, శ్రీ సాయి విష్ణుసహస్రనామ సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. సాయంత్రం శ్రీ సాయి పల్లకి సేవ కార్యక్రమంలో భాగంగా శ్రీ సాయిబాబా విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం దేవాలయాన్ని కార్పొరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ నాయకులు పవన్‌కుమార్ గౌడ్‌లు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.



సాయిబాబాదేవాలయంలో శ్రీ సాయిసప్తాహ ఉత్సవాల్లో భాగంగా పూజా కార్యక్రమం

బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

బౌద్ధనగర్: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా డివిజన్లో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లోని ఇంటింటికీ తిరిగి తొమ్మిదేళ్ల పాలనలో ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పై ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. భారత దేశం మోడీ పాలనలో ప్రపంచ పటంలోనే అగ్రస్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవిప్రసాద్ గౌడ్, ఆదం విజయ్ కుమార్, వీఎస్. రాజు, అజయ్ కుమార్, సురేష్, సుధాకర్, భాస్కర్ గౌడ్, సత్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన భారీ చెట్టు...

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లోని ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం భారీ చెట్టు కూలిపోయింది. దీంతో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాలను సీతాఫల్‌మండి ఫ్లైఓవర్ వైపుకు వాహనాలను దారి మళ్లించారు. అలాగే స్థానిక కార్పొరేటర్ కంది శైలజ అక్కడికి చేరుకుని జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం అందించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు అక్కడికి చేరుకుని కూలిపోయిన చెట్టు కొమ్మలను తొలగించారు. ఎలక్ట్రికల్ అధికారులు వచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేసి చెట్టు కొమ్మలు తొలగించిన తర్వాత పునరుద్దరించారు. దీంతో కొద్దిసేపటికి వాహనాలను యదావిధిగా అనుమతించారు.



చెట్టు కొమ్మను తొలగిస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో బక్రీద్





బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న దృశ్యం

సనత్‌నగర్: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే ఈద్–ఉల్–అజీహా (బక్రీద్)ను సనత్‌నగర్ నియోజకవర్గంలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింల సంప్రదాయం ప్రకారం తమకు కలిగిన ధనంలో నుంచి మేకలు, గొర్రెలను ఖుర్బానీ ఇచ్చారు. ఈ సందర్భంగా బక్రీద్ విశిష్టతను మతపెద్దలు ఆయా ఈద్గాలకు హాజరైన ముస్లిం సోదరులకు వివరించారు. ఖురాన్‌లో మహ్మద్‌ప్రవక్త వాక్యాలను వినిపించారు. సనత్‌నగర్‌లో ఈద్గాలో వందలాది మంది సామూహిక ప్రార్ధనలు నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మసీదులు, ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు పరస్పరం ఆత్మీయ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

చిలకలగూడ: ముస్లింలకు పవిత్రమైన బక్రీదు పర్వదినాన్ని చిలకలగూడలోని పలు ప్రాంతాల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చిలకలగూడ బడేమసీదు, ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజు నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించిన ముస్లిం సోదరులు పరస్పరం ఆలింగనాలు చేసుకుని బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిలకలగూడ ఈద్గా మైదానంలో వేలాది మంది చేపట్టిన ప్రత్యేక నమాజు కార్యక్రమానికి స్థానిక కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.



సనత్‌నగర్ ఈద్గాలో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

విద్యా హక్కు చట్టానికి ప్రభుత్వం తూట్లు

- మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు దోమల మల్లేష్ మాదిగ

పంజగుట్ట: తెలంగాణ ప్రభుత్వం విద్యా హక్కు చట్టం అమలు పరచకుండా కార్పొరేట్ విద్యా సంస్థల అడుగులకు మడుగులు ఒత్తుతోందని మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు దోమల మల్లేష్ మాదిగ ఆరోపించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్ విద్యా సంస్థల్లో 25 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఉన్నా ఏ విద్యా సంస్థా దాన్ని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు నిబంధనలు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోచుకుంటున్న కార్పొరేట్ శక్తుల ఆగడాలను అరికట్టడమే లక్ష్యంగా మాదిగ దండోరా పనిచేస్తుందన్నారు. ఎస్సీ జనాభా దామాషా ప్రకారం అన్ని పార్టీలు సీట్లు కేటాయించాలని ఇదే విషయమై అన్ని పార్టీల అధ్యక్షులతో త్వరలోనే కలుస్తామన్నారు. ఉద్యమ సమయంలో వామపక్ష విద్యార్థి నాయకులు, కుల సంఘాలలో పనిచేసిన వారు తెలంగాణ మాదిగ శక్తి పేరుతో ఉద్యమాలు నడిపిన వారి అనుభవాల నుంచి మాదిగ దండోరా ఏర్పడిందన్నారు. కో ఆర్డినేటర్ బొజ్జ శ్రీధర్ మాదిగ, ఈదుల పరుశురామ్ మాదిగ, బోయ ప్రవీణ్ మాదిగ, పోతరాజు కిరణ్, భవాని, అరుణ్ పాల్గొన్నారు.



మాదిగ దండోరా పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు